

# జన్నారంలో అడ్డూఅదుపు లేని ఇసుక దందా

## ఇందనపల్లి వద్ద పట్టుబడ్డ టిప్పర్.. ఒకరిపై కేసు నమోదు

**ఇందిరమ్మ ఇళ్ల పేరుతో అక్రమ దందాలు!**

**నకిలీ వేబిల్లులతో యథేచ్ఛగా ఇసుక రవాణా**

**నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న అధికారులు**

**సామాన్యులకు అందని ఉచిత ఇసుక.. నల్లబజారులో భారీ ధరలు**



> జన్నారం మండలంలో అక్రమ ఇసుక రవాణా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. ప్రభుత్వ నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కి, నకిలీ వేబిల్లులతో అక్రమార్కులు యథేచ్ఛగా ఇసుకను తరలిస్తున్నారు. ఈ దందా తాజాగా ఇందనపల్లి అటవీ శాఖ చెక్ పోస్ట్ వద్ద బట్టబయలైంది. అటవీ శాఖ అధికారులు చేపట్టిన ఆకస్మిక తనిఖీల్లో ఒక టిప్పర్ పట్టుబడటం మండల వ్యాప్తంగా పెను సంచలనంగా మారింది.

**-- తుడుం జితేందర్ --**
జనం పవర్-ఉత్తర తెలంగాణ బ్యూరో

అటవీశాఖ ఉన్నతాధికారుల నుంచి అందిన ముందస్తు సమాచారంతో ఎఫ్ఆర్ఓ గోదారి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో అధికారులు నిఘా పెట్టారు. ఈ క్రమంలో టీఎస్ 04 యూబీ 8546 నంబరు గల టిప్పర్‌ను ఆపి తనిఖీ చేయగా, అందులో నకిలీ వేబిల్లుతో ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించారు. ఈ ఇసుక విలువ సుమారు ఒకటిన్నర లక్షల రూపాయల వరకు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. నిర్మల్ జిల్లా ఉడుంపూర్‌కు చెందిన కాసవేని విజయ్ అనే వ్యక్తికి ఈ వాహనం చెందినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. టిప్పర్‌ను సీజ్ చేసి రేంజ్ ఆఫీసులో భద్రపరిచిన అధికారులు, బాధ్యులపై చట్టరీత్యా కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఆర్ఓ స్పష్టం చేశారు.

### ఇందిరమ్మ ఇళ్ల ముసుగులో నిలువు దోపిడీ

మండలంలోని కొందరు అక్రమార్కులు పేదల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన "ఇందిరమ్మ ఇళ్ల" నిర్మాణాల పేరును అడ్డుపెట్టుకుని సామాన్యులను బురిడీ కొట్టిస్తున్నారు. ఇళ్ల నిర్మాణాల కోసం ఉచితంగా లభించాల్సిన ఇసుకను పేదలకు చేరనివ్వకుండా, ప్రైవేటు వ్యక్తులకు భారీ ధరలకు విక్రయిస్తున్నారని స్థానిక నాయకులు ఆరోపిస్తున్నారు. ఏ చలానా కట్టకుండా, పైసా ఖర్చు లేకుండా తీసుకువస్తున్న ఇసుకను ఒక్కో ట్రాక్టరుకు రూ. 2000 నుండి రూ. 3500 వరకు అమ్ముకుంటున్నారు. ఇళ్ల నిర్మాణం పేరు చెప్పి పొలాల్లో, ఖాళీ స్థలాల్లో ఇసుకను పెద్ద ఎత్తున నిల్వ చేసి (డంపింగ్), కృత్రిమ కొరత సృష్టించి భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలో సుమారు 350 ఇందిరమ్మ ఇళ్లు మంజూరైతే, క్షేత్రస్థాయిలో ఇళ్ల నిర్మాణం కంటే అక్రమ రవాణానే ఎక్కువగా జరుగుతోందని ప్రజలు వాపోతున్నారు.

### అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం

మండలంలో నిత్యం వందలాది ట్రాక్టర్లు పదుల సంఖ్యలో ట్రిప్పులు వేస్తూ ఇసుకను తరలిస్తున్నా.. ఎమ్మార్వో, ఎస్ఐ, ఎఫ్డీఓ వంటి ఉన్నతాధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రజలు నిలదీస్తున్నారు. ప్రజల సొమ్ముతో జీతాలు తీసుకుంటున్న అధికారులు అక్రమార్కులకు కొమ్ముకాయడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. ఇసుక ఎక్కడి నుండి వస్తోంది? ఎవరు తరలిస్తున్నారు? అన్న కనీస పర్యవేక్షణ కూడా అధికారులు చేయడం లేదని స్థానిక ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, అటవీశాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఈ ఇసుక మాఫియాను అరికట్టాలని, పేదలకు ఇసుక సరైన ధరకు అందేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

---

## సిద్దిపేటలో పద్మశాలి ప్రజా ప్రతినిధుల

# ఆత్మీయ సన్మానం

- రాజకీయాల్లో మనకు తగిన ప్రాధాన్యత దక్కాలి
- జిల్లా అధ్యక్షులు డాక్టర్ కస్తూరి సతీష్
- తెలంగాణలో 15 శాతం జనాభా ఉన్నా.. గుర్తింపు 5 శాతమేనని ఆవేదన
- రాబోయే మున్సిపాలిటీ ఎన్నికల్లో ఐక్యంగా ఉండి మన అభ్యర్థులను గెలిపించుకోవాలి
- పేద విద్యార్థులకు, కుటుంబాలకు అండగా నిలవాలని పిలుపు







**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేట జిల్లా పద్మశాలి ప్రజా ప్రతినిధుల ఆత్మీయ సన్మాన కార్యక్రమం శనివారం జిల్లా కేంద్రంలో అత్యంత వైభవంగా జరిగింది. సిద్దిపేట జిల్లా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలో గత ఎన్నికల్లో విజయం సాధించిన సర్పంచులు, ఉప సర్పంచులు, కౌన్సిలర్లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో దుబ్బాకకు చెందిన శ్రీరామ్ సంగీత రవీందర్ తో పాటు చేర్యాల కౌన్సిలర్లు, వివిధ మండలాల ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

### ఐక్యతతోనే రాజకీయ గుర్తింపు

ఈ కార్యక్రమానికి గౌరవ అధ్యక్షులుగా రిటైర్డ్ టీచర్ బూర మల్లేశం హాజరుకాగా, జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు డాక్టర్ కస్తూరి సతీష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పట్టణ అధ్యక్షులు కాముని రాజేశం ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సతీష్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో పద్మశాలీల జనాభా సుమారు 15 శాతం ఉన్నప్పటికీ, రాజకీయ, సామాజిక రంగాల్లో తగిన గుర్తింపు 5 శాతం కూడా దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కుల బంధువులందరూ ఐక్యంగా ముందుకు వచ్చి ఉద్యమ భావంతో పని చేస్తేనే మనకు సరైన ప్రాధాన్యత లభిస్తుందని పిలుపునిచ్చారు. రాబోయే సిద్దిపేట 116 మున్సిపాలిటీ ఎన్నికల్లో పద్మశాలి అభ్యర్థులకు ప్రతి ఒక్కరూ సంపూర్ణ సంఘీభావం ప్రకటించాలని సతీష్ కోరారు. మన అభ్యర్థులను గెలిపించుకోవడమే లక్ష్యంగా కృషి చేయాలన్నారు. రాజకీయాలతో పాటు సామాజిక బాధ్యతగా ఆర్థికంగా వెనుకబడిన పద్మశాలి కుటుంబాలకు సహాయం అందించాలని, చదువుకుంటున్న విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేసే సేవా కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. సంఘం ఐక్యతే మన శక్తి అని, అందరం కలిసికట్టుగా ఉంటేనే సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని పలువురు ప్రజా ప్రతినిధులు ఈ సందర్భంగా తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి పద్మశాలి బంధువులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గెలుపొందిన ప్రతినిధులకు శాలువాలు కప్పి, జ్ఞాపికలను అందజేసి ఘనంగా సన్మానించారు.



# అక్రమ కేసులతో వేధిస్తే ఊరుకోం

- మాజీ మంత్రి హరీష్ రావు
- సంగారెడ్డి జైలులో బీఆర్ఎస్ కార్యకర్తలకు పరామర్శ
- కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తిన హరీష్ రావు
- రాష్ట్రంలో రాజ్యాంగం కూని అవుతోందని విమర్శ
- రైతు బంధు విడుదల చేయకుంటే ఉద్యమం తప్పదని హెచ్చరిక



**సంగారెడ్డి, ఫిబ్రవరి 21 (జనం పవర్):**

మెదక్ జిల్లాలో అక్రమ కేసులతో అరెస్టు అయ్యి సంగారెడ్డి కంది సెంట్రల్ జైలులో ఉన్న 13 మంది బీఆర్ఎస్ కార్యకర్తలను మాజీ మంత్రి టీ. హరీష్ రావు శనివారం పరామర్శించారు. జైలుకు వెళ్లిన ఆయన కార్యకర్తల ఆరోగ్య పరిస్థితి, కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ వారికి అండగా ఉంటుందని, ఎవరూ అధైర్యపడవద్దని భరోసా కల్పించారు. ఈ పరామర్శలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు, మాజీ ఎమ్మెల్యేలు పద్మ దేవేందర్ రెడ్డి, శశిధర్ రెడ్డి పాల్గొన్నారు.

### ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు

అనంతరం జైలు వెలుపల హరీష్ రావు మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని అక్రమ కేసులు బనాయిస్తోందని మండిపడ్డారు. మెదక్ మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒక వార్డు ఎక్కువగా గెలిచిందన్న కక్షతోనే ఈ వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి భారీ కాన్వాయ్‌తో వెళ్లిన కాంగ్రెస్ ఎమ్మెల్యేపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. బాధితులైన ఎస్సీ నాయకులపైనే తిరిగి అట్రాసిటీ కేసులు పెట్టడం పోలీసుల పక్షపాత వైఖరికి నిదర్శనమని ధ్వజమెత్తారు.

### పోలీసులు ప్రైవేటు సైన్యంలా మారారు

రాష్ట్రంలో పోలీసులు ప్రభుత్వానికి ప్రైవేటు సైన్యంలా వ్యవహరిస్తున్నారని హరీష్ రావు విమర్శించారు. ఫిర్యాదులు చేసినా పట్టించుకోని అధికారులు, అక్రమార్కులకు కొమ్ముకాస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి అక్రమాన్ని తాము డైరీలో నమోదు చేస్తున్నామని, చట్టాన్ని అతిక్రమించే వారు భవిష్యత్తులో సమాధానం చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు. రాష్ట్రంలో జరుగుతున్న ఈ అరాచకాలు రాహుల్ గాంధీకి కనిపించడం లేదా అని నిలదీశారు.

### రైతు బంధుపై అల్టిమేటం

రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రైతు బంధు నిధులను విడుదల చేయాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతుల పక్షాన పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని స్పష్టం చేశారు. అధికార మదంతో ప్రతిపక్ష కార్యకర్తలను ఇబ్బంది పెడితే ప్రజలే గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. పోలీసుల వ్యవహారంపై అసెంబ్లీలో చర్చించి, నిలదీస్తామని ఆయన వెల్లడించారు.

# కార్మికులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

- సిరుల తల్లి కనుమరుగయ్యే ప్రమాదం ఉంది: కామెర గట్టయ్య
- రెండేళ్లు గడుస్తున్నా తీరని కార్మిక సమస్యలు
- మెడికల్ బోర్డు కోసం 4 వేల మంది నిరీక్షణ
- ప్రజాప్రతినిధులను నిలదీయాలని కార్మిక వర్గానికి పిలుపు



**మంచిర్యాల, ఫిబ్రవరి 21 (జనం పవర్):**

ఉత్తర తెలంగాణకు కొంగుబంగారమైన సింగరేణి సంస్థ కనుమరుగయ్యే ప్రమాదం పొంచి ఉందని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం (టీఎస్ యూఎస్) రాష్ట్ర అధ్యక్షులు కామెర గట్టయ్య ఆందోళన వ్యక్తం చేశారు. భూపాలపల్లిలోని బాతల రాజన్న భవన్‌లో శనివారం నిర్వహించిన సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన ప్రసంగించారు. కార్మిక క్షేత్రంలో గుర్తింపు సంఘాల నాయకులు గొంతు మూగబోయిందని, కార్మికుల పక్షాన నిలబడే వారే కరువయ్యారని మండిపడ్డారు.

### నీటి మూటలుగా మారిన హామీలు

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు కేవలం ఓట్ల కోసమేనని గట్టయ్య విమర్శించారు. అధికారంలోకి వచ్చి రెండున్నర ఏళ్లు గడుస్తున్నా, కార్మికుల ఒక్క మౌలిక సమస్య కూడా పరిష్కారం కాలేదని ధ్వజమెత్తారు. ఏటా ఐదు కొత్త గనులు ప్రారంభిస్తామని నమ్మబలికి, ఇప్పుడు ఉన్న గనులనే మూసివేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మెడికల్ బోర్డు నిర్వహించకపోవడంతో సుమారు 4 వేల మంది కార్మికులు తమ భవిష్యత్తు కోసం ఎదురుచూస్తున్నారని, దీనిపై సీఎం రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

### కార్మికులకు అందని న్యాయం

సొంత ఇంటి కల సాకారం కాలేదని, మారుపేర్ల సమస్య అలాగే ఉందని, కాంట్రాక్ట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం దక్కడం లేదని గట్టయ్య ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి ప్రాంతంలో గెలిచిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యేలను కార్మికులు నిలదీయాలని పిలుపునిచ్చారు. ఈ ప్రజా పాలనలో కార్మికులకు ఒరిగింది ఏమీ లేదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి కుమారస్వామి, నీరెటి రాజన్న, సమ్ము రాజయ్య, దాసరి జనార్దన్, కాసర్ల ప్రసాద్ రెడ్డి, జైపాల్ సింగ్, బేగ్, వెంకటేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.





# బోరేగాంలో వైభవంగా రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్టాపన

### విగ్రహ ధాతగా అవకాశం రావడం నా అదృష్టం: నవీన్ రామోజి
### భక్తుల జయజయ ధ్వానాలతో మారుమోగిన గ్రామం
### అందరికీ అమ్మవారి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్ష

**ఝరాసంగం, ఫిబ్రవరి 21 (జనం పవర్):**

సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం బోరేగాం గ్రామంలో శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం కన్నుల పండువగా సాగింది. నూతనంగా నిర్మించిన ఆలయంలో శుక్రవారం భక్తుల జయజయ ధ్వానాల మధ్య జగన్మాత విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఈ వేడుకతో గ్రామం మొత్తం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ పరిసరాలు కోలాహలంగా మారాయి. ఈ దేవాలయానికి రామోజిపల్లి దివ్య – నవీన్ దంపతులు విగ్రహాన్ని విరాళంగా అందించారు. విగ్రహ ధాతగా వ్యవహరించిన నవీన్ రామోజి ఈ సందర్భంగా మాట్లాడుతూ.. లోకమాత విగ్రహాన్ని బహూకరించే భాగ్యం కలగడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఆ తల్లి కరుణాకటాక్షాలతో గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో కలకాలం సుఖసంతోషాలతో ఉండాలని ఆయన కోరుకున్నారు. విగ్రహ ప్రతిష్టాపన సందర్భంగా వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువత అత్యధిక సంఖ్యలో పాల్గొని వేడుకను దిగ్విజయం చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాల పంపిణీ జరిగింది.

# విద్యార్థులకు చట్టాలపై అవగాహన తప్పనిసరి

**కొడంగల్, ఫిబ్రవరి 21 :** కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) యూనిట్ల ఆధ్వర్యంలో విద్యార్థులకు న్యాయ విద్య, చట్టాలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన శనివారం జరిగిన ఈ కార్యక్రమానికి మండల న్యాయ సేవాధికార సంస్థ సంపూర్ణ సహకారం అందించింది. ఈ సదస్సుకు కొడంగల్ మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టుకు చెందిన సి. సునీత, జెస్సికా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రస్తుత సమాజంలో జరుగుతున్న పలు అవాంఛనీయ సంఘటనల పట్ల విద్యార్థినులు ఎంతో అప్రమత్తంగా ఉండాలని వారు సూచించారు. ముఖ్యంగా ర్యాగింగ్, గృహహింస, వరకట్న దురాచారం, కుల వైషమ్యాలు, కిడ్నాప్, మానవ అక్రమ రవాణా వంటి నేరాలు జరిగినప్పుడు ఎలా స్పందించాలో వివరించారు. ఆపదలో ఉన్నప్పుడు ధైర్యంగా ముందుకు వచ్చి ప్రథమ సమాచార నివేదిక (ఎఫ్ఐఆర్) నమోదు చేసే విధానంపై అవగాహన కల్పించారు. అలాగే, కష్టాల్లో ఉన్నవారికి ప్రభుత్వం అందించే ఉచిత న్యాయ సేవలు, లోక్ అదాలత్ ద్వారా కేసులను సత్వరమే పరిష్కరించుకునే విధానం తదితర అంశాలను విద్యార్థులకు అర్థమయ్యేలా చెప్పారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. తమ కళాశాల పూర్తిగా ర్యాగింగ్ రహిత ప్రాంగణమని స్పష్టం చేశారు. విద్యార్థులు ర్యాగింగ్ లాంటి చట్టవ్యతిరేక చర్యలకు దూరంగా ఉండి, కేవలం చదువుపై మాత్రమే దృష్టి పెట్టి తమ బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలని హితవు పలికారు.

## యథేచ్ఛగా అక్రమ రవాణా!

### నియంత్రణ లేని భారీ వాహనాలతో పెరిగిన ప్రమాదాలు

### అనుమతుల ముసుగులో కలప, ఇసుక అక్రమ రవాణా

### కాలుష్యంతో అనారోగ్యం.. పర్యావరణంపై తీవ్ర ప్రభావం

### స్పీడ్ బ్రేకర్లు లేక ప్రాణాలు అరచేతిలో పెట్టుకున్న పాదచారులు

# అభివృద్ధి పేరుతో మృత్యుపాశం



**తుడుం జితేందర్-జనం పవర్ - ఉత్తర తెలంగాణ బ్యూరో**

ఒకప్పుడు కఠినమైన అటవీ నిబంధనలతో ప్రశాంతంగా ఉన్న కవ్వాల్ టైగర్ జోన్ ఇప్పుడు భారీ వాహనాల ఇష్టారాజ్యానికి అడ్డాగా మారింది. మండల అభివృద్ధి సాకుతో భారీ వాహనాలకు పర్మిషన్లు సాధించిన కొందరు నాయకుల తీరు ఇప్పుడు స్థానిక ప్రజల పాలిట శాపంగా మారుతోంది. 12 నుండి 16 టైర్ల భారీ వాహనాలు తిరిగే సామర్థ్యం ఇక్కడి రోడ్లకు లేకున్నా, అధికారులు అనుమతులు ఇవ్వడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### ప్రాణాలకు గ్యారెంటీ లేని ప్రయాణం

నియంత్రణ లేని వేగంతో వాహనాలు దూసుకుపోతుండటంతో ప్రమాదాల తీవ్రత పెరుగుతోంది. డ్రైవర్లు నిద్రలేమితో లేదా మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. జనావాసాల మధ్య కనీసం స్పీడ్ బ్రేకర్లు కూడా లేకపోవడంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణిస్తున్నారు. అభివృద్ధి కోసం ధర్నాలు చేసి పర్మిషన్లు తెచ్చిన నాయకులు, ఇప్పుడు జరుగుతున్న ప్రాణ నష్టానికి సమాధానం చెప్పాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.








### అభివృద్ధి మాటున అక్రమ దందా

భారీ వాహనాల అనుమతిని ఆసరాగా చేసుకుని అక్రమార్కులు అడవి సంపదను యథేచ్ఛగా తరలిస్తున్నారు. కలప మాఫియాతో పాటు ఇసుక అక్రమ రవాణా లక్షల కోట్లకు చేరింది. నకిలీ బిల్లులతో జరిగే అక్రమ వ్యాపారాలకు ఈ భారీ వాహనాల అనుమతి ఒక 'కవచం'లా మారింది. దీనివల్ల ధ్వని, వాయు కాలుష్యం పెరిగి ప్రజలు శ్వాసకోస వ్యాధుల బారిన పడుతున్నారు. టైగర్ జోన్ లాంటి సున్నితమైన ప్రాంతంలో జీవవైవిధ్యం దెబ్బతింటోందని పర్యావరణ ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### తక్షణ చర్యలు అవసరం

మండల వ్యాప్తంగా ప్రధాన కూడళ్ల వద్ద శాస్త్రీయమైన స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. అటవీ శాఖ చెక్ పోస్టుల వద్ద వాహన తనిఖీలను కఠినతరం చేయాలని, డ్రైవర్లకు బ్రీత్ అనలైజర్ పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించే వాహనాల పర్మిషన్లను రద్దు చేయడంతో పాటు, అక్రమ రవాణాపై ఎస్ఐ, ఎమ్మార్వో వంటి ఉన్నతాధికారులు కఠినంగా వ్యవహరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

